క్లుప్తంగా

రాజ్‌మా విత్తనాల పంపిణీ



కిటుములలో రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణమ్మ

చింతపల్లి: గిరిజన రైతులు రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కిటుముల పంచాయతీ సర్పంచ్ రమణమ్మ అన్నారు. శుక్రవారం పంచాయతీ కేంద్రంలో గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలని ఆమె కోరారు. ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం రేపు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఈ నెల 15న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులు, అయాసం, దడ, బీపీ, సుగర్, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పాటు స్త్రీల వ్యాధులు , పిల్లలు వ్యాధులకు వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు తీసుకుని రావాలన్నారు. దంత వైద్య సేవలు అందుతాయని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

గంగవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ (పౌరశాస్త్రం) బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కలింకోట కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పీజీలో 50% మార్కులు పొంది ఉండాలని, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమో ఇచ్చేందుకు అభ్యర్థులు హాజరు కాగలరని పేర్కొన్నారు. నేడు (శనివారం) నుంచి మంగళవారం వరకు వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని ఎంపిక నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులంతా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి



చట్రాపల్లి గ్రామంలో పర్యటిస్తున్న సీపీఐ నాయకులు

సీలేరు: గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో ఇటీవల తుపాను ధాటికి ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరిగిన బాధితులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు గ్రామంలో శుక్రవారం పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ మాట్లాడుతూ గ్రామంలో కొండచరియలు పడి మృతి చెందిన కుమారి కుటుంబానికి రూ.25లక్షలు, గాయాలైన ఒక్కొక్కరికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని, 37 మంది గిరిజన కుటుంబాలకు గృహాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ, సత్తిబాబు, కృష్ణపడాల్, రామరావు తదితరులున్నారు.

సంతలో పూలమొక్కలకు గిరాకీ



సంతలో విక్రయిస్తున్న పూలమొక్కలను కొనుగోలు చేస్తున్న గిరిజన మహిళ

డుంబ్రిగుడ: అరకు వారపు సంతలో పూల మొక్కలకు మంచి గిరాకీ లభిస్తుంది. ఈ మొక్కలను కొనుగోలు చేసేందుకు గిరిజనులు ఎగబడుతున్నారు. మందార, గుత్తుపూలు, జామ వంటి మొక్కలను రూ. 50 రూపాయిలు, గులాబీ, హైబ్రిడ్ గులాబీ జత రూ.150 నుంచి రూ.200, విరజాజి, హైబ్రిడ్ మల్లెలకు రూ.50 చొప్పున కొనుగోలు చేశారు. ముఖ్యంగా వ్యవసాయ భూముల్లో పాతేందుకు పనస, మామిడి, కొబ్బరి ఒక్కో మొక్కలను రూ.200 నుంచి రూ.250 వరకు కొనుగోలు చేశారు. పలు పూలమొక్కలను రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- సొవ్వాలో విస్తృతంగా కూరగాయలు, వాణిజ్య పంటలు
- మైదాన ప్రాంతాలకు తరలింపు
- గిట్టుబాటు ధరలు.. ఆనందంలో రైతులు



సొవ్వలో ఆకుకూరల సాగులో రైతులు



గన్నెలలో వరి పైరు

డుంబ్రిగుడ: ఏజెన్సీలో ఆకుకూరలు, కూరగాయల పంటలు విస్తృతంగా పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. మన్యంలోని చల్లని వాతావరణం సాగుకు అనుకూలంగా ఉండడంతో అటవీ వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాణిజ్య పంటలైన కాఫీ, మిరియాలు, పసుపు, వలిసెలు తదితర పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. అరకు నియోజకవర్గంలోని సొవ్వా పంచాయతీ కూరగాయలు, ఆకుకూరల పంటల సాగుకు ప్రత్యేక స్థానం సంతరించుకుంది. ఇక్కడ పండించే పంటలు విశాఖపట్నం, ఎస్.కోట, పెందుర్తి, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. మైదాన ప్రాంత వ్యాపారులు నేరుగా వచ్చి రైతుల వద్ద కొనుగోలు చేసి తరలిస్తుంటారు.

మండలంలోని సొవ్వ పంచాయితీ గత పాతికేళ్లుగా కూరగాయల పంటలను పండిస్తున్నారు. మార్కెట్‌లో గిరాకీ ఉండడంతో గిరిజన రైతులు మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. ఇక్కడి పంచాయతీల్లో నీరు పుష్కలంగా ఉండడంతో సాగుపై దృష్టి సారిస్తున్నారు. కొంతమందికి పాడేరు ఐటీడీఏ అందజేసి ఉన్నా రైతు బజారు కార్డుల ద్వారా వారివారి సొంత వాహనాలలో తరలిస్తున్నారు. ప్రస్తుతం సొవ్వ గ్రామంలో అల్లం, మిరపకాయ, బంగాళదుంపలు, చిలగడదుంపాలు, క్యారెట్, క్యాబేజీలతో పాటు వాణిజ్య పంటలు పిప్పళ్లు, వలిసెలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను పండిస్తున్నారు.

సంతల్లో జోరుగా వ్యాపారం

సొవ్వతో పాటు మండలంలోని రంగిలిసింగి, కండ్రుమ్, పోతంగి, కితలంగి, కురిడి, సాగర, గసభ, కొల్లాపుటు పంచాయితీలలో కూరగాయల సాగు గణనీయంగా ఉంది. అ గుంటసీమ, గుంటగన్నేల, రంగిలిసింగిలో వరి పంటకు డిమాండ్ ఉంది. ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలంలోని వారపు సంతలు జరుగుతాయి. ఇందులో భాగంగా కించుమండలో బుధవారం , అరకులో శుక్రవారం సంతలు జరుగుతాయి. ఇక్కడ వచ్చే వ్యాపారులు ముందురోజే చేరుకొని సరకులు కొనుగోలు చేసి మైదాన ప్రాంతానికి తరలిస్తుంటారు. ఒక్క శుక్రవారం కోటిన్నర రూపాయల వ్యాపారం జరుగుతుందని అధికారుల అంచనా. కూరగాయలతో పాటు కొండచీపుళ్లు, చింతపండు తదితర అటవీ సంపదను గిరిజనులు తీసుకు వచ్చి విక్రయిస్తారు. మండలంలోని ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో అల్లం పంట ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం అల్లం కిలో రూ.120 నుంచి రూ.150 వరకు ధరలు పలుకుతున్నాయి. మైదాన ప్రాంతాల్లో ఇక్కడి పంటలకు గిరాకీ ఉండడంతో గిట్టుబాటు ధరలు వస్తున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం



కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. అయితే రైతులకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తే మరింత ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండిస్తాం. ఫలితంగా దిగుబడి మరింత వస్తుంది. అల్లంలో మెలకువలు నేర్పించాలి. అప్పుడే అధిక దిగుబడి సాధిస్తాం.

– కొర్ర గోవింద్, కితలంగి గ్రామం, డుంబ్రిగుడ మండలం

ఆశాజనకంగా ధరలు



సంవత్సరం పంటలు వేస్తున్న వర్షాల కారణంగా కొంత మేర అల్లం పంట దెబ్బ తింటుంది. ప్రస్తుతం మన్యంలో వాతావరణం అనుకూలించడంతో కూరగాయల, వాణిజ్య పంటలు ఎక్కువగా పండిస్తున్నాం. ప్రస్తుతం సంతలో రేట్లు బట్టి కాస్తా కాసులు కురుస్తున్నాయి.

– పూజారి నారాయణ, కినంగూడ గ్రామం, కితలంగి పంచాయతీ

అంకితభావంతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు



టీచర్ సత్యవతి దంపతులను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నేతలు, ఉపాధ్యాయులు

చింతపల్లి: అంకితభావంతో మన్య ప్రాంతంలో పని చేస్తే ప్రత్యేక గుర్తింపు గౌరవం లభిస్తుందని పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ డీజీ నాథ్ అన్నారు. చౌడుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న దుంపా సత్యవతి శుక్రవారం పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా సత్యవతి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీజీ నాథ్, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటగిరి హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, బోడంనాయుడు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగరాజు, హెచ్‌ఎం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

గంగవరం: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరస తుపాన్ల కారణంగా ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య, ఉపాధ్యక్షుడు కత్తుల బాలురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎండపల్లి –రామవరం గ్రామంలో గంగవరం, అడ్డతీగల మండలాల రైతుకూలీ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఏఎస్సార్ జిల్లాలో భారీగా రహదారులు, పంటలు , గృహాలు నష్ట పోయాయారని గిరిజన ప్రజలను ఆదుకోవాలన్నారు. ప్రతీ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే చేసి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం నాయకులు రోలుపల్లి నూకారెడ్డి, సత్యవతి, రమణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా వరదల్లో మృతులకు, సీపీఎం అగ్రనేత సీతారం ఏచూరికి నివాళులర్పించారు.

రహదారి నిర్మించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, ఇల్లోపాలెం గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ ఇల్లోపాలెం గ్రామానికి రహదారి నిర్మించాలని శుక్రవారం గిరిజన సంఘం నేతల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ రాముల గ్రామం నుంచి వర్కుగుమ్మి వరకు నూతన రోడ్డును అధికారులు మంజూరు చేశారని, ఇల్లోపాలెం గ్రామానికి మాత్రం రహదారి మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. పీఆర్ అధికారులు రహదారి ప్లాన్ మర్చి, రాముల నుంచి ఇల్లోపాలెం వరకు రహదారి మంజూరు చేయాలని, లేనిపక్షంలో గ్రామ గిరిజనులతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా పాపినాయుడు బాధ్యతల స్వీకరణ



డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండల ఎస్ఐగా పాపినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి ఎస్ఐగా పని చేసిన ఆయన బదిలీపై డుంబ్రిగుడ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సంతోష్‌కుమార్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్టపై దృష్టి సారించి శాంతి భద్రతల పరిరక్షణతో పాటు వాహనాల తనిఖీలపై ప్రత్యే దృష్టి సారిస్తామన్నారు. ప్రజల భగస్వామంతో మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ ఆర్ట్స్ విభాగ ప్రిన్సిపాల్ అప్పారావు

డుంబ్రిగుడ: హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ విద్వాన్ డిగ్రీ ఉతీర్ణులైన అల్లూరి జిల్లాకు చెందిన నలుగురు గిరిజన విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ హిందీలో ప్రవేశాలు సాధించినట్టు పాడేరు ఐటీడీఏ హిందీ ప్రచార సభ కన్వీనర్ శెట్టి సూరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పీజీ సెట్ ప్రవేశ పరీక్షలో నలుగురు గిరిజన విద్యార్థులు ఉతీర్ణత సాధించినట్టు చెప్పారు. శెట్టి సూరిబాబు ప్రస్తుతం కించుమండ యూపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎంఏ హిందీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఏయూ ఆర్ట్స్ విభాగం ప్రిన్సిపాల్, తెలుగు విభాగ ఆచార్యులు జర్రా అప్పారావు అభినందించినట్టు ఆయన తెలిపారు.

పాఠశాలలో తనిఖీలు



యార్లగడ్డ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో కె.బాపన్నదొర శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను, తాగునీటి సౌకర్యాలను, మరుగుదొడ్లను, విద్యార్థులకు వండిన భోజనాన్ని, స్టోర్ రూమ్‌ను, హాస్టల్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడి గి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలుపై వార్డెన్, హెచ్‌ఎం లకు సలహాలు సూచనలిచ్చారు. సిక్ విద్యార్థుల స్థితిగతులపై ఆరా తీశారు. మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మెరుగైన విద్యా బోధనపై ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. హెచ్‌ఎం మద్దికొండ ఝాన్సీరాణి తదితరులున్నారు.

ఏచూరికి ఘన నివాళి



డుంబ్రిగుడలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



కూనవరంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



చింతూరులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ/చింతూరు/కూనవరం/వై.రామవరం: సీపీఎం జాతీయ కార్యదర్శి, అగ్రనేత సీతారాం ఏచూరి మృతికి జిల్లా వాప్తంగా నాయకులు శుక్రవారం సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీతారాం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు పోతురాజు, నాగేశ్వరరావు, శాంతిరాజు తదితరులు మాట్లాడుతూ సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం యావత్ భారతవని వామపక్షాలకు తీరని లోటుగా అన్నారు. విద్యార్థి దశ నుంచి జాతీయ రాజకీయాల్లో మార్క్సిస్ట్ మేధావిగా కార్పొరేట్ సంస్థల దోపిడీపై అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు అని కొనియాడారు. కార్మిక, కర్షక, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళ, రైతులు, బలహీన వర్గాలకు అండగా నిలబడి, వారి సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. వామపక్ష సిద్ధాంతాలను ఎంతో క్రమశిక్షణతో ప్రజల్లోకి తీసుకు వెళ్ళారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి వరకు నాయకత్వం వహించి ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. గసభ సర్పంచ్ సునిత, మాజీ సర్పంచ్ సురేష్, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నాయకులు పోతురాజు, సూర్యనారాయణ, సత్యనారాయణ, మత్తు, సీతారామయ్య, నాగరాజు, శాంతిరాజు, మల్లికార్జునరావు, సురేష్, శ్రీనివాసరావు, రంగమ్మ, సుబ్బమ్మ, చిన్నయ్య, రాజయ్య, రాంబాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అధ్వాన దారితో అవస్థలు

డుంబ్రిగుడ: జాతీయ రహదారి పనులు పూర్తికాకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న భారీ వాహనాలతో పాటు పాడేరు–అరకులోయ బస్సులు తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు. ఆటో, కార్లలో ప్రయాణించే వారికి దుమ్ము, ధూళి తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో జాతీయ హైవే అథారిటీ వారు కనీసం నీళ్లు జల్లే ప్రయత్నాలు చేయకపోవడం విమర్శలకు దారితీస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారలు స్పందించి ఈ రహదారి సకాలంలో పనులు పూర్తిచేసి రోడ్డు వినియోగంలోకి తీసుకురావాలని వాహనచోదకులు కోరుతున్నారు.

బ్రిడ్జిపై యథావిధిగా రాకపోకలు



వంతెనపై పేరుకుపోయిన బురద, మట్టి తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

మారేడుమిల్లి: మండలంలోని బొడ్లంక గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపై నుంచి పెళ్లిరేవు వాగు వర్షాల కారణంగా పొంగి ప్రవహించడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. రోజు ఉదయం, మధ్యాహ్నం తిరిగే ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా నిలిచిపోయాయి. దీంతో లోతట్టు గ్రామాలకు బస్సు సర్వీస్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగు ఉధృతి తగ్గినప్పటికీ వంతనపై మట్టి చేరి అధ్వానంగా తయారైంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామస్తులు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన అధికారులను ఆదేశించడంతో శుక్రవారం పొక్లెయిన్ మట్టిని తొలగించి మార్గాన్ని సరిచేయడంతో యథావిధిగా రాకపోకలు ప్రారంభమయ్యాయి.

వైభవంగా గణేష్ నిమజ్జనం



మినుములూరులో గణపతి విగ్రహం ఊరేగింపులో భక్తులు



పాడేరు మినుములూరులోని ఊరేగింపులో థింసా నృత్యాలు చేస్తున్న యువత

సాక్షి,పాడేరు/జి.మాడుగుల: జిల్లాలోని పాడేరులోని మినుములూరు, జి.మాడుగుల మండల కేంద్రంతో పాటు ఈదులబయలు గ్రామంలో గణనాథుల నిమజ్జన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో థింసా నృత్యాలు, కోలాటం, తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో యువత సందడి చేశారు. అనంతరం సమీప గెడ్డల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. జి.మాడుగులలో సర్పంచ్ కిముడు రాంబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ కార్యక్రమాన్ని నిర్వహించింది.

గ్రామాల్లో భారీ అన్నసమారాధన

ముంచంగిపుట్టు/జి.మాడుగుల/ వై.రామవరం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ముంచంగిపుట్టు, జి.మాడుగుల, వై.రామవరం మండలాల్లో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ఉదయ్‌కుమార్, సురేష్, ప్రసన్నకుమార్, శ్రీను, మురళి, సాయికిరణ్, రవి కృష్ణ, శ్యామ్, గణపతిరాజు, చంటి, మహేష్, నరేష్, శివ, శంకర్ పాల్గొన్నారు.



జి.మాడుగులలో మహిళల కోలాటం



జి.మాడుగుల పురవీధుల్లో వినాయకుని ఊరేగింపు



ముంచంగిపుట్టులో అన్నసమారాధనలో భక్తులు



పి.యర్రగొండలో అన్నసమారాధనలో భక్తులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి



రాజవొమ్మంగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



రాజవొమ్మంగిలో తృణధాన్యాలతో చేసిన గర్భిణి చిత్రం



గంగవరంలో పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

చింతూరు/రాజవొమ్మంగి/గంగవరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చింతూరు, రాజవొమ్మంగి, గంగవరం ప్రాంతాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో సీడీపీవోలు విజయగౌరి, దేవమణి, సీహెచ్.లక్ష్మీ తదితరులు మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాగులు, సజ్జలు, జొన్నలతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి వాటి వల్ల బలమైన పౌష్టికాహారం లభిస్తుందని, వాటిని రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు పండ్లు, పూలు, గాజులు తదితర సామగ్రి అందజేశారు. పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ రమణి, వెలుగు హెచ్‌డీ సీసీ నిర్మల, సూపర్‌వైజర్ అరుణలత తదితరులు పాల్గొన్నారు. వివిధ పౌష్టికాహారాలను తయారు చేసి వారికి బహుమతులు అందజేసారు. వెంకటలక్ష్మి అనే అంగన్‌వాడీ టీచర్ చిరుధాన్యాలతో తీర్చిదిద్దిన గర్భిణీ చిత్రం అందరిని ఆకట్టుకొంది. గంగవరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ వీరభద్రరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, ఎంఈవో మల్లేశ్వరరావు, ఏఎస్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



చింతపల్లి పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

హుకుంపేట: గిరిజన గ్రామల్లో బాల్యవివాహాలు జరగకుండా అరికట్టేందుకు దృష్టి పెట్టాలని ఎంపీడీవో వెంకటరావు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యలయంలో సీడీపీవో బాలచంద్రమణిదేవి ఆధ్వర్యంలో శుక్రవారం బాల్యవివాహాలు అరికట్టేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల మాతా శిశు మరణాలు జరిగే అవకాశాలున్నాయని, చిన్న వయస్సులోనే తల్లి అయిన వారి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా మహిళ పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నియంత్రణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది.అక్షరాస్యత లేకపోవడం వల్ల గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ చిన్న వయసులోనే ఆడపిల్లలకు వివాహాలు చేస్తున్నారన్నారు. వీటిని నియంత్రించి బాల్య వివాహాల అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. డీటీ రాజ్‌కుమార్, ఎంఈఓలు ప్రసాద్, బోడంనాయుడు, ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.